www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 1 జనవరి 2026

5

ఏలూరు

నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

గుడ్‌బై 2025.. వెల్‌కం 2026 అంటూ కొంగొత్త ఆశలు.. ఆకాంక్షలతో యువత కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. విష్‌యూ హ్యాపీ న్యూఇయర్ అంటూ ఉప్పొంగే ఉత్తేజంతో కేరింతలు కొట్టింది. కాలగమనంలో కొత్త సంవత్సరం ఆవిష్కృతమైంది. కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ.. అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తోంది. గత అనుభవాలను నెమరవేసుకుంటూ నూతనోత్సాహంతో జిల్లా వాసులు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు.

కొత్త ఏడాదిలో కష్టాలు తీరేనా..!

2025 సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరం 2026లోకి జిల్లా ప్రజానీకం అడుగుపెట్టారు. తమ బతుకులు ఈ ఏడాదిలోనైనా మారాలని కోరుకుంటూ ఎన్నో ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్నారు. జిల్లా ప్రజానీకాన్ని దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న సమస్యలు ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిష్కరిస్తుందా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో తాగునీటి సమస్య నుంచి నిత్యావసరాల ధరల భారం వరకూ అనేక సమస్యలతో జనం సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించి 2026లో ప్రజలు సంతోషంగా గడిపేలా చేస్తుందో.. లేదో వేచిచూడాలి.

- సామాన్యులపై నిత్యావసరాల ధరల భారం
- కౌలురైతుల కన్నీటి వ్యథలు
- నిండా మునిగిన పోలవరం నిర్వాసితులు
- కొల్లేరు సమస్యకు మోక్షం లభించేనా
- డెల్టా ఆధునికీకరణ జరగక రైతుల కష్టాలు
- గుక్కెడు తాగునీటి కోసం నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుతం ప్రజలు నిరంతరం ఎదుర్కొంటున్న సమస్యల్లో నిత్యావసరాల ధరల భారం అతిపెద్దది. కడుపు నిండా పట్టెడన్నం తినలేని పరిస్థితి సామాన్య కుటుంబాల్లో నెలకొంది. కందిపప్పు, మినపప్పు, పచ్చిశనగపప్పు, వంటనూనె ధరలు అన్నీ కిలో దాదాపు రూ.150 అంతకుపైగా పలుకుతున్నాయి. వేతనాలు తగ్గిపోగా ధరలు మాత్రం అందనంత ఎత్తుకు పెరిగాయి. జిఎస్‌టి తగ్గించినట్లు కేంద్రంలోని మోడీ సర్కార్ ఊదరగొడుతున్నా.. నిత్యావసర వస్తువుల ధరల్లో మార్పు రాకపోగా, మరింత పెరిగిన పరిస్థితి ఉంది. గతంలో నెలకు రూ.రెండు వేలు బడ్జెట్ పెట్టే కుటుంబం ఇప్పుడు రూ.నాలుగు వేల వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు సైతం భారీగా పెరగడంతో వారం నాడు సంత చేయాలంటే కనీసం రూ.700 వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆక్వా పరిశ్రమలతోపాటు అనేక పరిశ్రమల్లో రోజంతా పని చేసినా రూ.250 నుంచి రూ.300 వరకూ మాత్రమే వేతనం అందుతోంది. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు రూ.పది నుంచి రూ.15 వేల వరకూ మాత్రమే ఉన్నాయి. పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో సామాన్య కుటుంబం సరైన తిండితినే పరిస్థితి లేదు. 2026లోనైనా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని అంతా ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతుల కన్నీటి వ్యథ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయసాగులో 80 శాతం కౌలురైతులే సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించాల్సిన రూ.20 వేలు ఏడాదిన్నర గడిచినా ఇవ్వలేదు. భూయజమానులకు రెండు విడతలు జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను పూర్తిగా విస్మరించింది. పంట నష్టం, బీమా పరిహారం సైతం భూయజమానుల ఖాతాల్లోనే వేసింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పుల పాలై కన్నీరుమున్నీరుగా కౌలురైతుల కుటుంబాలు విలపిస్తున్నాయి. కొత్త సంవత్సరంలోనైనా అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ చేయడంతోపాటు కౌలురైతులకు పంట నష్టపరిహారం, బీమా వంటివి అందేలా చర్యలు తీసుకోవాలని కౌలురైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పోలవరం నిర్వాసితుల కష్టాలు తీరేనా.. చింతలపూడి పనులు జరిగేనా

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. కొంతమేర పరిహారం జమ చేసినా ఇంకా అనేక కుటుంబాలకు భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వలేదు. 41.15 కాంటూరు పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలను ఖాళీ చేయిస్తామని చెప్పినా ఇప్పటికీ జరగలేదు. ఇప్పటికీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వడంగాని, గృహనిర్మాణాలు పూర్తి చేయడంగాని లేదు. దీంతో ప్రతియేటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలకు పోలవరం నిర్వాసితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. నిర్మించిన కాలనీల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఏడాదిలోనైనా నిర్వాసితుల కష్టాలు తీర్చాలని అంతా ఆశగా కోరుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో మెట్ట ప్రాంతంలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందకుండాపోయింది. భూసేకరణ చేసిన రైతులకు పరిహారం ఇవ్వలేదు. 2026లోనైనా చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించి పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు.

కొల్లేరు సమస్య తీరేనా

కొల్లేరు ప్రజల సమస్యలు తీరుస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర సాధికారిక కమిటీ కొద్దినెలల క్రితం కొల్లేరులో పర్యటించింది. అక్కడి ప్రజల కష్టాలను నేరుగా చూసింది. వినతిపత్రాలు స్వీకరించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. 120 గ్రామాలకు చెందిన దాదాపు ఐదు లక్షల జనాభా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరు సమస్యను పరిష్కరించి తమకు ఉపాధి కల్పించాలని కొల్లేరువాసులు కోరుతున్నారు. కొత్త ఏడాదిలోనైనా కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపుతారో, లేదో చూడాల్సి ఉంది.

గుక్కెడు తాగునీటి కోసం అవస్థలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో గుక్కెడు తాగునీరు దొరకని పరిస్థితి ఉంది. చేపల చెరువులతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తామని దశాబ్దకాలం నుంచి చెబుతున్నా ఇప్పటికీ చేయలేదు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో వాటర్‌గ్రిడ్‌కు సంబంధించిన పనులకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ ఏడాదిలోనైనా వాటర్‌గ్రిడ్ పూర్తి చేసి తాగునీరు అందించాలని జనం కోరుతున్నారు. డెల్టా ఆధునికీకరణ లేక రైతులు ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటను కోల్పోతున్నారు. కొత్త ఏడాదిలోనైనా కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేసి న్యాయం చేయాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నేరాలు తగ్గుముఖం

జిల్లా పోలీసు యంత్రాంగం కృషి ఫలితం
రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక దృష్టి
జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేరాల నిరోధానికి జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి కృషి చేసిందని, ఫలితంగా 2024తో పోలిస్తే 2025లో నేరాల సంఖ్య తగ్గిందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే నేరాల అదుపు శాతం 17గా నమోదైందని, నేరం జరిగిన గంటలు లేదా రోజుల వ్యవధిలో నేరస్తులను అరెస్టు చేశామని వివరించారు. పోలీసు శాఖ మెరుగైన సేవలందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని, వచ్చే ఏడాది నేరాల నిరోధానికి పూర్తిస్థాయిలో కృషి చేసేందుకు పక్కాప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. 2024లో 9313 కేసులు నమోదవ్వగా, 2025లో 7727 కేసులు నమోదయ్యాని తెలిపారు. హత్యలు 2024లో 39 జరగ్గా, 2025లో 26 జరిగాయన్నారు. అత్యాచారాలు 2024లో 80 నమోదయ్యాని, 2025లో 59 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇక బాలికలపై వేధింపులు, అత్యాచారాలు, అత్యాచార యత్నాలు వంటి పలు కేసులు 2024లో 160 కేసులు నమోదయ్యాయని, 2025లో 125 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఇక కిడ్నాప్‌లకు సంబంధించి 46 శాతం తగ్గాయని, 2024లో 54 కేసులు నమోదవ్వగా, 2025లో 29 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మొత్తం కేసుల్లో చూసుకుంటే అపహరణ కేసులు గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. బాధిత కేసుల విషయానికి వస్తే 2024లో 955, 2025లో 765 కేసులు నమోదయ్యాయన్నారు. వైట్ కాలర్ నేరాల అదుపులోనూ జిల్లా పోలీసులు ఒక అడుగు ముందుకు వేశారన్నారు. 2024లో 340 కేసులు నమోదవ్వగా, 2025లో 253 కేసులే నమోదయ్యాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు 2024లో 102 కేసులు నమోదవ్వగా, 2025లో 54 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. దొంగతనాల కేసులకొస్తే 2024లో తొమ్మిది కేసులు, 2025లో ఏడు కేసులు నమోదయ్యాయన్నారు. గృహదొంగతనాలకు సంబంధించి 2024లో 56 నమోదయ్యాయని, 2025లో 44 కేసులు నమోదయ్యాయని చెప్పారు. చోరీ సొమ్ము రికవరీలోనూ గణనీయమైన కృషి చేసినట్లు చెప్పారు. వీటిలో ఎనిమిది శాతం వృద్ధి సాధించామన్నారు. 663 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా, 339 మంది మృతి చెందారన్నారు. సెల్ఫ్ యాక్సిడెంట్ కేసుల్లోనే 52 మంది మృత్యువాత పడ్డారని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 19 శాతం ప్రమాదాలు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. మరణాలు కూడా పది శాతం పెరగడం బాధాకరమన్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 43 కేసుల్లో 51 మందికి శిక్ష పడిందన్నారు. ఈ ఏడాది లోక్‌అదాలత్‌లో భాగంగా 12658 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు తెలిపారు. ఎక్సైజ్ కేసుల విషయానికి వస్తే 70 నమోదవ్వగా 84 మందిని అరెస్ట్ చేశారని, 1260 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు వివరించారు. గంజాయికి సంబంధించి 15 కేసులు నమోదవ్వగా, 49 మందిని అరెస్ట్ చేసినట్లు, 12 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మొత్తం 55 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 61 నమోదవ్వగా, బాధితులకు 22,70,465 రూపాయలు రికవరీ చేసి వారికి అందించామన్నారు. పోలీసు యంత్రాంగం సమిష్టి కృషి వల్లే ఈ ఏడాది నేరాల సంఖ్య అదుపులోకి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల విషయంలో కొన్నిచోట్ల పెరిగినప్పటికీ, కొన్నిచోట్ల తగ్గాయని, మొత్తంగా చూస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రమాదాల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. వీటిని తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు. డ్రోన్ల వినియోగం మరింత పెంచి నేరాలను పటిష్టవంతంగా అదుపు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలకు సంబంధించి ఏర్పాటు చేసిన శక్తి టీమ్ విశేషంగా కృషి చేసిందని ప్రశంసించారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి కూడా ఆయన అభినందనలు తెలిపారు.

నిడమర్రు ఎఫ్‌డిఒపై చర్యలు

ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తూ ఆదేశాలు
ప్రమోషన్, ఇంక్రిమెంట్లపై ప్రభావం
రెండు రోజుల్లో బదిలీ చేస్తాం
మత్స్య శాఖ జిల్లా అధికారి బి.రాజ్‌కుమార్
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మత్స్యశాఖ నిడమర్రు మండలాధికారి (ఎఫ్‌డిఒ) పివి.రవికుమార్‌పై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో చేపల చెరువులకు సంబంధించిన వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆ శాఖ అధికారుల విచారణలో తేలడంతో చర్యలు చేపట్టారు. ఎఫ్‌డిఒ రవికుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని 'ప్రజాశక్తి'లో వరుస కథనాలు ప్రచురితమవ్వడం, బాధితులు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలకు దిగారు. 2025 ఏప్రిల్ 17న మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలతో అప్పట్లో కైకలూరు ఎడిగా ఉన్న బి.రాజ్‌కుమార్‌ను ఎఫ్‌డిఒపై విచారణ చేసిన నివేదిక అందించాలని విచారణాధికారిగా నియమించారు. మే 24 నాటికి విచారణ పూర్తి చేసి విచారణాధికారి నివేదికను అందించారు. నివేదికను జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు అందించారు. కొద్దినెలల క్రితం ఎఫ్‌డిఒకు ఆర్టికల్ ఆఫ్ ప్రొసిడింగ్స్ ఇస్తూ వివరణ కోరారు. ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎఫ్‌డిఒ వివరణ కూడా ఇవ్వలేదు. దీంతో డిసెంబర్ 31న నిబంధనల ప్రకారం ఛార్జెస్ ఫ్రేమ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎఫ్‌డిఒకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు నిలిచిపోనున్నాయి. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి బి.రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల వద్ద వివరణ ఇవ్వకపోవడంతో ఎఫ్‌డిఒపై ఛార్జెస్ ఫ్రేమ్ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నిడమర్రు మండలం నుంచి ఎఫ్‌డిఒ రవికుమార్‌ను తప్పించి వేరే అధికారిని నియమిస్తామని తెలిపారు. వివాదాస్పద చెరువు విషయంలో నిబంధనల ప్రకారమే ముందుకు సాగుతామని చెప్పారు.

చేపల చెరువులకు అనుమతులు తిరస్కరణ

మత్స్యశాఖ జిల్లా అధికారి బి.రాజ్‌కుమార్
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తు చేసిన చేపల చెరువులకు అనుమతులు తిరస్కరించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి బి.రాజ్‌కుమార్ తెలిపారు. 'ప్రజాశక్తి'లో బుధవారం 'అంతా నా ఇష్టం' శీర్షికన ప్రచురితమైన కథనానికి మత్స్యశాఖ అధికారి స్పందించారు. అడవికొలనుకు చెందిన శ్రీరామ్మూర్తి, 38 మంది కలిసి 33.30 ఎకరాలకు, యాళ్ల శ్రీను 47 మంది ఇతరులు 29.43 ఎకరాల చేపల చెరువులకు అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయగా ఈ రెండు చేపల చెరువులు 70 ఎకరాలుగా ఒకే చెరువుగా ఉన్నట్లుగా గుర్తించామన్నారు. మత్స్యశాఖ సమక్షంలో రెవెన్యూ సర్వేయర్‌చే ఎటువంటి హద్దులూ చూపించకుండా, గట్టు వేయకుండా చెరువులకు అనుమతికి దరఖాస్తు చేశారని, సంబంధిత ఆక్వా రైతులు మత్స్యశాఖ నుంచి ఆటోకాడ్ మ్యాప్ తయారు చేయలేదని తెలిపారు. వారిచ్చిన ఆటోక్యాడ్ మ్యాప్ తప్పుల తడకగా ఉందని, 70 ఎకరాల చేపల చెరువులో 94 సెంట్లు నీటిబోదె ఉందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన రెండు చెరువులకు రెవెన్యూ సర్వేయర్‌చే హద్దులు చూపించి గట్లు వేయాలని, 94 సెంట్ల పంటబోదెను తవ్వి చూపించాల్సి ఉందని తెలిపారు. ఈ విధంగా పాటించకపోతే అనుమతులు మంజూరు చేయడం కుదరదని మత్స్యశాఖ అధికారి నోటీస్ ద్వారా తెలిపినట్లు వివరణలో పేర్కొన్నారు. ఈ చెరువులపై పొరుగు రైతుల ఫిర్యాదులు సైతం ఉన్నాయి. రెండు చెరువులకు అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు.

కొనసాగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

సంఘీభావం తెలిపిన సిఐటియు నేతలు

నినదిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎనిమిదేళ్ల నుంచి జీతాలు పెంచలేదని, తమకు న్యాయంగా ఇవ్వాల్సిన జీతం విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న నిరసన దీక్ష ఎనిమిదో రోజుకి చేరుకుంది. ఉదయం నుంచి మొదలై సాయంత్రం వరకు వణికించే చలిలో సైతం దీక్షను కొనసాగిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్ల పట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఐ3 బ్లాక్ ముందు టెంట్ వేసుకుని శాంతియుతంగా నిరసన దీక్షను చేస్తామని కోరినప్పటికీ టెంట్ వేయడానికి ఉన్నతాధికారులు అంగీకరించలేదు. అయినా అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెనక్కి తగ్గకుండా ఎండను కూడా లెక్క చేయకుండా ఐ3 బ్లాక్ ముందున్న రోడ్డుపై కూర్చుని తన నిరసనను కొనసాగించారు. కొంతమంది మెంటర్లు మద్దతు ప్రకటించారు. అనంతరం పరిపాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు. నిరసన దీక్ష చేశారు. ఉన్నతాధికారులు మొండి వైఖరిని వీడి సత్వరమే తమకు న్యాయం చేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు కోరారు. దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టి.నర్సాపురం రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. చింతలపూడి- రావికంపాడు ఆర్‌అండ్‌బి రహదారి పనులను బుధవారం స్థానికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చింతలపూడి నుండి టి.నర్సాపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని, పనులు వేగవంతంగా చేయిస్తున్నామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి రోడ్డు మార్జిన్లను సక్రమంగా నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని ఆయన సూచించారు.

పేదల పక్షపాతి ప్రజాశక్తి

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

క్యాలెండర్ ఆవిష్కరించిన జగదీశ్వరి, విజయనాయక్

ప్రజాశక్తి - పోలవరం

ప్రజా సమస్యలను వెలికి తీయడంతోపాటు కష్టజీవులకు అండగా ఉంటూ పేదల పక్షపాతిగా ప్రజాశక్తి దినపత్రిక నిలుస్తోందని ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. పోలవరం మండలం చేగొండపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో ప్రజాశక్తి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జగదీశ్వరి, విజయనాయక్ దంపతులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక కార్మికులు, రైతులు, పేదల పక్షాన నిలబడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతోందని ప్రశంసించారు. సమాజంలో అన్యాయాలను ప్రశ్నించే సాహసోపేత పాత్రను ప్రజాశక్తి పోషిస్తోందన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ప్రజాశక్తి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. క్యాలెండర్ ప్రజలకు ఉపయోగకరమైన సమాచారంతో ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాశక్తి తన శైలి కొనసాగించాలని ఆకాంక్షించారు. ప్రజాశక్తి విలేకరి పి.అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

4న కార్మిక సభకు కదలిరండి

సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా కదిలి రావాలని నేతలు పిలుపునిచ్చారు. రెండు జిల్లాల్లో బుధవారం సిఐటియు నేతలు వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహించారు. తణుకులో రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేయగా, నరసాపురం మండలంలో అంగన్వాడీలు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. నూజివీడులో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించగా, కొయ్యలగూడెంలో పంచాయతీ కార్మికులు సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు.

జోరుగా సిఐటియు అఖిల భారత మహాసభ ప్రచారం
నూజివీడులో మోటారు సైకిల్ ర్యాలీ
తణుకులో రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ

నూజివీడులో మోటారు సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో బుధవారం సాయంత్రం నీ సిఐటియు కార్యాలయం నుండి నూజివీడు పట్టణంలోని మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ చినగాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్, శ్రీనివాస సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ అఖిలభారత 18వ మహాసభ మొట్టమొదటిసారి కార్మికవర్గ కేంద్రమైన విశాఖ నగరంలో జరుగుతుందని, జనవరి 4న జరిగే బహిరంగ సభకు నూజివీడు ప్రాంతం నుండి వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ నిర్వహించారు. గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 4న చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలా రాములమ్మ, హైమావతి, సింహాచలం, నూకాలమ్మ, లక్ష్మీ భాస్కరరావు, మౌలాలి, షేక్ బాజ్జి, ఆరేటి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: నినదిస్తున్న పంచాయతీ కార్మికులు

తణుకు: జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని పట్టణ కమిటీ ఆధ్వర్యాన బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 200 మంది రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 4న జరిగే బహిరంగ సభ జయప్రదం చేయాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి మాట్లాడుతూ నేడు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. కార్మికుల హక్కులు తొలగించి, కార్పొరేట్లకు బానిసలుగా మార్చాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, ఛైర్మన్ వల్లూరి గంగయ్య, కమిటీ సభ్యులు సుంకర ప్రసాద్ చేతుల మీదుగా ఫుడ్ ప్యాకెట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో నేతలు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, కె.నాగరత్నం, భాస్కర్‌రావు, అంజిబాబు, ఎం.గంగాధర్‌రెడ్డి, ఎం.రమేష్, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: 4న విశాఖలో జరిగే సిఐటియు బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పిఎంలంకలోని డిజిటల్ భవనం వద్ద అంగన్వాడీల ఆధ్వర్యాన సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వి.వెంకటలక్ష్మి, భోగేశ్వరి, విజయలక్ష్మి, ముత్యాలమ్మ, రాజేశ్వరి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

విశాఖపట్నంలో బుధవారం ప్రారంభమైన సిఐటియు అఖిల భారత మహాసభకు ప్రతినిధులుగా పశ్చిమగోదావరి నుంచి హాజరైన కె.రాజారామ్మోహన్‌రాయ్, బి.వాసుదేవరావు (ముందు వరుస), ఏలూరు జిల్లా నుంచి హాజరైన డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, టి.మాణిక్యం (రెండోవరుస)

ఆకర్షణీయంగా ప్రజాశక్తి క్యాలెండర్

ఆవిష్కరణలో ఎంపిపి సత్యనారాయణ, సర్పంచి కైకమ్మ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాశక్తి 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ వేర్వేరుగా ఆవిష్కరించారు. ఎంపిపి తన కార్యాలయంలో, సర్పంచి కైకమ్మ తన స్వగృహంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాశక్తి రూపొందించిన 2026 నూతన క్యాలెండర్ ఎంతో ఆకర్షణీయంగా, అద్భుతంగా రూపొందిందని ప్రశంసించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో, సమాజ హిత కార్యక్రమాలకు దోహదపడేలా క్యాలెండర్ ఉండటం అభినందనీయమన్నారు. సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్‌లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ బిక్షాలు, సోమల వరప్రసాద్, పల్లెం పుణేశ్వరరావు, జిల్లా మేధావుల విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ మద్రివాడ సుధాకర్ రెడ్డి, పెయ్యేరు వైస్ సర్పంచి దివి సతీష్, దాసరి లక్ష్మణ్, రామకృష్ణ, కృష్ణ, ప్రజాశక్తి విలేకరి శేవా సెల్వరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిపి సత్యనారాయణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచి కైకమ్మ

శ్రీవారి ఆలయ ఇఒ మూర్తి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి పదవి విరమణ సన్మాన సభ కొండపైన ఉన్న మాధవ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనువంశిక ధర్మకర్త నివృతారావు మాట్లాడుతూ 1963లో జన్మించిన ఆయన 1984లో దేవదాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, సహాయ కార్యనిర్వహణాధికారి అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, రీజినల్ జాయింట్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో రాష్ట్రంలో అనేక ప్రముఖ దేవాలయాల్లో పనిచేసి చివరగా ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ కార్యనిర్వాహణాధికారిగా పదవి విరమణ చేస్తున్నారన్నారు. ఎంతో నిబద్ధత నిజాయితీతో పనిచేసే వ్యక్తి అని, ఆయన ఉద్యోగ విరమణ చివరి రెండు రోజుల్లో స్వామివారి గిరిప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎంతో బాధ్యతగా నిర్వహించారని చెప్పారు. ఇఒ డివి.భాస్కర్ మాట్లాడుతూ నిబద్ధతతో ఎన్నో సమస్యలను చర్చించి పరిష్కరించేవారని, ఆయనకు రిటైర్‌మెంట్ కాదని, సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభమని అన్నారు. నూతనంగా డిప్యూటీ ఇఒగా బాధ్యతలు తీసుకోబోతున్న బద్రాజీ మాట్లాడుతూ ఆయనతో కలిసి పనిచేసిన అనుభవం పూర్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు సిబ్బంది, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు, సూపరింటెండెంట్లు, ఎఇఒలు, ఇతర దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూర్తి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

మానస స్కూలులో కరెన్సీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల్లో కరెన్సీ, నాణాల పట్ల జ్ఞానం, విజ్ఞానం పెంచేందుకు, పొదుపు అలవాటు చేసేందుకు ఆర్థిక అవగాహన కల్పించేందుకు, చరిత్ర గురించి తెలుసుకునేందుకు జ్ఞానం కార్యక్రమం భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల వేదికగా కరెన్సీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. పురాతన నాణాలు, కరెన్సీ సేకరణకర్తగా గుర్తింపు పొందిన ఏలూరుకు చెందిన మహమ్మద్ అలీ ఖాన్ సహకారంతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ఆయన సేకరించిన సుమారు రూ.ఐదు లక్షల విలువైన నాణాలు, కరెన్సీని విద్యార్థుల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, కొందరు ఔత్సాహిక విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ ఆధ్వర్యంలో కరెన్సీ, నాణాల ప్రాముఖ్యత గురించి సందర్శకులకు వివరించారు. స్మారక నాణాలు, కరెన్సీ నోట్లతో తయారుచేసిన వివిధ అలంకరణలు ప్రదర్శనకు ఉంచారు. ఇవన్నీ సందర్శకులను ఆకట్టుకున్నాయి.

కరెన్సీని పరిశీలిస్తున్న లింగరాజు, రవీంద్రకుమార్

నేరాలు - ఘోరాలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

వృద్ధ మహిళలను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను ముసునూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 25వ తేదీన వలసపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు బండారుపల్లి జయలక్ష్మికి మత్తు మందు ఇచ్చి, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్ దొంగిలించిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని మంగళవారం సాయంత్రం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామం వద్ద ముసునూరు ఎస్ఐ చిరంజీవి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంతో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో నమోదైన ఇతర సమాన స్వభావం గల కేసులను కూడా ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితుడు గత 20 ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటి దొంగతనాలు, వృద్ధ మహిళలకు మత్తు పదార్థాలు ఇచ్చి నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గుర్తు తెలీని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన జీలుగుమిల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొట్టె దేవారం(55) పని నిమిత్తం పూచికపాడు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో వాగొడ్డుగూడెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి చూసి పోలీసులు సమాచారం తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అశ్వారావుపేట పోలీసులు దేవారం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసంతో రూ.1.50 లక్షలు స్వాహా

బాధితునికి తిరిగి అందించిన సైబర్ పోలీసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయన్నగూడెం గ్రామానికి చెందిన ఎన్.మణికంఠకుమార్ ఇటీవల జరిగిన ఆన్‌లైన్ లావాదేవీ కారణంగా రూ.1.50 లక్షలు నష్టపోయారు. ఈ ఘటనపై బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ క్రైమ్ అధికారులు, సంబంధిత బ్యాంక్ ఖాతా వివరాలను సాంకేతికంగా ట్రేస్ చేసి ఖాతాదారుడిని గుర్తించారు. వేగవంతమైన దర్యాప్తు, బ్యాంకు అధికారులతో సమన్వయ చర్యల ఫలితంగా 48 గంటల్లోపే పూర్తి మొత్తాన్ని బాధితుడు ఎన్.మణికంఠకుమార్‌కు తిరిగి అందించారని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

టి.నరసాపురం :చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం వెలగపాడులో ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించి 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్‌ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పోశమ్మకు అభినయ నాట్య విరాజిత పురస్కారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యుటిఎఫ్ మండలాధ్యక్షురాలు, పండువారిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మడకం పోశమ్మ కూచిపూడి నాట్య అకాడమి వారిచే అభినయ నాట్య విరాజిత పురస్కారాన్ని నాట్య చారిణి రూపాదేవి చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిరు సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. పురస్కారం అందుకోవడం పట్ల యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు హర్షం చేశారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

క్రిస్మస్, న్యూఇయర్ వారోత్సవ వేడుకల్లో భాగంగా పొంగుటూరు గ్రామంలో బుధవారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీయోను ప్రార్థన మందిర పాస్టర్ మల్లిపూడి సువర్ణరాజు ఆధ్వర్యంలో మహిళలకు 200 మందికి పైగా చీరలను పంపిణీ చేశారు. తమ సంస్థ కేనన్య మినిస్ట్రీస్ ద్వారా వితంతువులైన మహిళలకు, వృద్ధులకు ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సువర్ణరాజు తెలిపారు. అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను చదివిస్తూ సువర్ణరాజు, ప్రేమలత దంపతులు స్ఫూర్తిదాయకంగా నిలిచారని సర్పంచి పసుపులేటి రాంబాబు తెలిపారు. క్రీస్తు సందేశాలను, జీతాలను ఆలపిస్తూ పొంగుటూరు, యాదవోలు, కన్నాయిగూడెం విశ్వాసులు శాంతిర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులు వేసిన ముగ్గు

శ్రీసుగుణ కళాశాలలో న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి - కలిదిండి

2026 ఏడాదికి స్వాగతం పలుకుతూ స్థానిక శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ రకాల పుష్పాలు, రంగ వల్లులతో కళాశాల ప్రాంగణాన్ని అలంకరించారు. కొత్త ఏడాదిలో విద్యా ర్థులు మంచి ఫలితాలు సాధిం చాలని కళాశాల డైరెక్టర్ కారి రాజమణి అన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. 2025కు వీడ్కోలు పలుకుతూ, 2026కు స్వాగతం పలుకుతూ సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ టివి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

1982- 83 పూర్వ విద్యార్థుల (సొస్వా) అసోసియేషన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ వారిచే రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎల్ పుష్పలత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ యుటిఎఫ్ వారు రూపొందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటువంటి ఈ స్కూలులో చదివిన 1982-83 పూర్వ విద్యార్థులు సేవా దృక్పథంతో చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని ఆమె కొనియాడారు. విద్యార్థుల పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో 1982-83 సొస్వా కార్యదర్శి మోత్రు శ్యాంబాబు, కోశాధికారి నీలం నాగేశ్వరరావు, సభ్యులు అక్కినేని బెనర్జీ, పర్వాతనేని ప్రసాద్, ముత్తయ్య, నరేష్ కోటేశ్వరరావు, ఎడ్ల సత్యనారాయణ, రెహమాన్, యుటిఎఫ్ మండలాధ్యక్షులు బి.బాబూరావు, ప్రధాన కార్యదర్శి, ఎం.చెన్నకేశవరావు, సభ్యులు బి.శ్రీనివాసరావు, రఘుబాబు, బాల కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు, రైతు కూలీల క్షేమం, ప్రభుత్వ ధ్యేయం అనే నినాదంతో మండలంలో ఈ నెల రెండు నుంచి తొమ్మిదో తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ గ్రామసభల సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. రైతుల నుంచి పాస్ పుస్తకాలు స్వీకరించిన వివరాలను బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన రైతులు నిర్ణయించిన తేదీల్లో గ్రామ సభలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

నకిలీ ఇంజిన్ ఆయిల్ తయారీ

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో నిర్వహిస్తున్న నకిలీ ఇంజన్ ఆయిల్ తయారీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ముదినేపల్లిలో నకిలీ ఇంజన్ ఆయిల్ తయారు చేస్తున్న కెవి.సురేష్ నివాస గృహాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. కెవి.సురేష్ పి.నరేంద్రతో కలిసి వివిధ ప్రసిద్ధ కంపెనీల పేర్లతో నకిలీ ఇంజిన్ ఆయిల్స్, నకిలీ బిఎస్-6ని అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డిఎస్‌పితో పాటు కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు ఉన్నారు.

జాతీయ పోటీలకు బయ్యన్నగూడెం విద్యార్థులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బయ్యన్నగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.రవికుమార్ బుధవారం తెలిపారు. గత నెల 13న తిరుపతిలో అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారన్నారు. గర్ల్స్ విభాగంలో పాల్గొన్న ఎం.వరలక్ష్మి, డి.సంజన, ఇవాంజెలిన్ ఉన్న జట్టు కాంస్య పతకం సాధించిందని చెప్పారు. బోయ్స్ విభాగంలో కె.మోహన్, టి.గణేష్, బి.వంశీ ప్రతిభ కనబర్చడంతో సెలెక్టర్లు ఆరుగురిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ రవికుమార్, ఉపాధ్యాయులు బి.ఉదయభాస్కర్, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ కోడి నాగలక్ష్మి అభినందించారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆర్‌జియుకెటి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవా కారక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఐదో రోజు సేవాకార్యక్రమాలు అత్యంత ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిశాయి. బోరవంచ, రావిచర్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు బోరవంచలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శిబిర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పివి.లక్ష్మణరావు, ప్రోగ్రాం ఆఫీసర్ బి.లక్ష్మణ్‌రావు, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వివిధ ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -3 ఆధ్వర్యంలో రావిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పావని, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ సత్యదేవ్ పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాలను పరిశీలించిన ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, ఆర్‌జియుకెటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవాభావాన్ని ప్రశంసిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్లు తెలిపారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

ఎంఎం.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నత శ్రేణిమార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చదవాలని, ఈ మేరకు ఉపాధ్యాయులు, తల్లితండ్రుల సహకారంతోపాటు, విద్యాశాఖ ప్రత్యేకించిన ప్రత్యేక కార్యక్రమాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతిదేవి కోరారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేకించిన వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా ఎంఎం.పురం పాఠశాలను దత్తత తీసుకున్న ఎంపిడిఒ నిత్య పర్యటనలో భాగంగా బుధవారం పాఠశాలను సందర్శించారు. వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 26 మందిలో తొమ్మిది మంది ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 60 శాతం పైగా మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్‌గా గుర్తింపు పొందారన్నారు. 16 మంది 50 శాతం పైగా మార్కులను సాధించి రైజింగ్ స్టార్స్‌గా గుర్తింపు పొందాలని వివరించారు. వీరితో పాటు మంచం నుంచి కదలలేని వికలాంగ విద్యార్థిని భవిత ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ పొంది పాఠశాల విద్యార్థిగా నమోదై పరీక్ష నిబంధనలకు అనుగుణంగా పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. వ్యక్తిగతంగా విద్యార్థులకు సహకారంగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందించామన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా వివిధ సందరాల్లో నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ.1,21,014 ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు గ్రామానికి చెందిన శ్రీ వర్రె జగన్నాథం ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వర్రె వెంకట సత్యనారాయణ, నీరజ (యుఎస్ఎ) దంపతులు తామరకొల్లులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమానికి రూ.1,21,041 చెక్కును ఆశ్రమం ఛైర్మన్ ఏరిచర్ల రఫాయేల్‌కు అందించినట్లు ట్రస్ట్ కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ అన్నారు. సంఘం పరిధిలోని 35 మంది వృద్ధులకు రెండు పూటలా భోజనం ఇంటికి పంపేలా ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఇప్పటికే రూ.9,42,502 సంఘం ఇల్లు నిర్మాణానికి, భోజనాలకు వెంకట సత్యనారాయణ, నీరజ దంపతులు ఆర్థిక సాయం అందించారన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ చీకటి సత్యనారాయణ, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సత్యనారాయణ, నీరజ

రోడ్డు అభివృద్ధి పనుల ప్రారంభంపై హర్షం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

టి.నరసాపురం మండల ప్రజలు అనేక ఏళ్లుగా ఎదురు చూస్తున్న చింతలపూడి - టి.నర్సాపురం ఆర్అండ్‌బి రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించడం పట్ల మండలానికి చెందిన సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం వ్యక్తం చేస్తూ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏళ్ల తరబడి గుంతల మయంగా మారి నరకప్రాయంగా ఉన్న చింతలపూడి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడంతో రోడ్డుకు మోక్షం లభించిందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టి.నర్సాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్ పాషా మాట్లాడుతూ టి.నర్సాపురం మండలం నుంచి అనునిత్యం విద్య, వైద్యం వంటి ప్రతి పనికి చింతలపూడి రావాల్సి ఉంటుందని, రోడ్డు గుంతలమాయంగా మారటంతో పది కిలోమీటర్ల ప్రయాణం గంటకు పైగా పడుతోందని, ఈ నేపథ్యంలో మండల ప్రజల ఆధ్వర్యంలో చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌ను తమ ఇబ్బందులు చెప్పుకున్నామని చెప్పారు. ఆయన స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, మూడు చోట్ల మలుపులు తగ్గించి ప్రమాదాల నివారణ చర్యలు కూడా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, కటకం వెంకటేశ్వరరావు(కొండ), కన్నం సర్వేశ్వరరావు, కుప్పాల బాబు, ఎర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఫార్మసిస్టును వేధిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ ఆలీని శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం పరిధిలోని డ్రగ్ ఇన్స్పెక్టర్ ఫార్మసిస్ట్‌పై లైంగిక వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మహిళా కమిషన్ ఆదేశించినట్లు ఎస్‌పి వెంటనే ఈవిషయంపై చర్యలు తీసుకోవాలని, కారకులను అరెస్ట్ చేసి శిక్షించాలని, ఇటువంటివి మరొకసారి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

సంఘాల డైరీలు, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ముసునూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యుటిఎఫ్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో యుటిఎఫ్ మండల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, మండల ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు, గౌరవ అధ్యక్షులు సిహెచ్.జాకబ్‌రాజ్,

దెందులూరు :దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ఎస్‌టియు ఉపాధ్యాయులకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఎస్‌టియు మండలాధ్యక్షుడు పరసా నాగార్జున మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయులకు నూతన సంవత్సరంలో అన్ని విధాలుగా అండదండలుగా ఉంటామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తమ వంతు మద్దతు, సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నెర్సు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి రమేష్, రాష్ట్ర బాధ్యులు షఫీ, ఉపాధ్యక్షులు భూషణం, శ్రీనివాస్, కార్యదర్శి ప్రభాకర్ గుప్త, రమేష్ సిపిఎస్ కన్వీనర్ సాయి శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ అమృత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎస్‌టియు డైరీ, క్యాలెండర్‌ను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కిరణ్‌బాబు, నరసింహారావు, ప్రభాకర్, తిరుపతి స్వామి, అబ్రహం, అప్‌ల్యాండ్ ఏరియా మండలాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. సహాధ్యక్షులు పుల్లయ్య, ఉపాధ్యాయులు సత్యప్రియ, కోశాధికారి నక్క నారాయణ, సీనియర్ నాయకులు దేవరపల్లి బెనర్జీ, కొలకలూరి రాజు, మరీదు జ్యోతిప్రకాష్, వీర రాంబాబు, పివి.రమణ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

పింఛన్ సొమ్ము సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అర్హులందరికీ సంక్షేమ కార్యక్రమాలను పుష్కలంగా, పారదర్శకంగా చేరవేసేందుకు పటిష్టవంతమైన బృహత్తర ప్రణాళికలతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. స్థానిక తొమ్మిదో డివిజన్‌లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కొయ్యలగూడెం : మండలంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలవ్యాప్తంగా 10,077 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందించాల్సి ఉండగా 94 శాతం వరకు పంపిణీ పూర్తైనట్లు ఎంపిడిఒ తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పెన్షన్ పంపిణీ సజావుగా సాగిందని అధికారులు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొని పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల గ్రామంలో పెన్షన్లు పంపిణీ చేశారు.గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, టిడిపి ద్వారకాతిరుమల మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్ (బద్రి), సర్పంచి కుంటం స్వర్ణలత, జనసేన పట్టణ అధ్యక్షులు కోట అంజిబాబు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని బర్రింకలపాడులో పలువురికి ఎంఎల్ఎ పింఛన్లను అందించారు. మండల వ్యాప్తంగా 4217 పింఛన్లకు 3918 పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా తొలిరోజు 92.9 శాతం పూర్తైనట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని శ్రీనివాసపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి గ్రామ ఏలికే ప్రసాద్, పిఎసిఎస్ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు, గ్రామ సెక్రటరీ, విఆర్ఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నెల్లి రమేష్, మన్నెల్లి చింతయ్య, చిడిపి బ్రహ్మయ్యతో పాటు కూటమి నాయకులు పాల్గొని పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీనివాసపురం గ్రామపంచాయతీ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మండవల్లి : పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు చాబత్తిన విజయ్ పాల్గొని మాట్లాడారు. మండవల్లిలో 601 పెన్షన్‌దారులకు 526 మందికి రూ.22.22 లక్షలు 87.57 శాతం పెన్షన్లను బుధవారం ఒక్కరోజే పంపిణీ చేశామని తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, యార్లగడ్డ శంకర్, వీరవల్లి శివయ్య, గుడివాడ గణేష్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంఎల్ఎ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆ పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన ఉంగుటూరులో వెలుగు సంస్థ ఆధ్వర్యంలో ఎంపిటిసి సభ్యులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ సౌజన్యంతో వంద మంది వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 31 మంది రక్తదానం చేశారు. వెలుగు సంస్థ ద్వారా సంచార మంచినీటి ట్యాంకుకు మరమతో చేసి ఆధునీకరించి గ్రామానికి అంకితం చేశారు. పుట్టినరోజు కేకును వాసుబాబు సోదరుడు చిన్నబాబు ముఖ్య అతిథిగా కట్ చేసి వేడుక నిర్వహించారు.

మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సచివాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సచివాలయం-4లో బుధవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డిఎల్.ప్రమద్వర మాట్లాడారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సిబ్బందితో పాటు సచివాలయం-4 పరిధిలో ఉన్న ప్రజలతో కేక్ కట్ చేసి సహపంక్తి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తనగాల మల్లయ్య, కాటూరి ఏలియా, పొదిలి రాయప్ప, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు సత్కారం

ప్రజాశక్తి - మండవల్లి

పార్టీకి అండగా నిలబడి అంకితభావంతో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ టిడిపి సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందని ఆ పార్టీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు స్పష్టం చేశారు. మండలంలోని కానుకొల్లులో టిడిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ అభివృద్ధి కోసం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయకులకు ప్రశంసపత్రాల ఆయన ముఖ్య అతిథిగా బుధవారం అందించారు.

చింతలపూడి : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఉత్తమ కార్యకర్తలకు పట్టణంలోని ఆర్‌కె మినీ ఫంక్షన్ హాలులో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాలుగు మండలాల్లో 21 మందికి రూ.23 లక్షల చెక్కు అందించారు.

నూజివీడు టౌన్ : తెలుదేశం పార్టీకి విశేష సేవలందించిన 80 మంది కార్యకర్తలను పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు, నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణ మాట్లాడారు. సన్మాన గ్రహీతలు తమ కృతజ్ఞత, హర్షం వ్యక్తం చేశారు.

బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కమిటీ పిలుపులో భాగంగా రెండో రోజైన బుధవారం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు, గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణరాజు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గత రెండు రోజులుగా విధులు బహిష్కరించి ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఒకటి, రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా హాస్పిటల్స్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేరీ, చంద్రకళ, చల్లాలు, వేముల రాజు, శ్రీను, కృష్ణవేణి, శకుంతుల, లక్ష్మి, అనసూయ, దుర్గారావు, రమాదేవి, సత్యవతి పాల్గొన్నారు.

చింతలపూడి :ఏరియా ఆసుపత్రుల్లో, పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, పాత బకాయిలు చెల్లించకుండా కొత్త కాంట్రాక్టును ఏ విధంగా నియమించారని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు తొర్లపాటి బాబు వైద్యారోగ్యశాఖాధికారులను నిలదీశారు. చింతలపూడిలో ది మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపా రు. చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ, నాగరాజు, రాజు, సుజాత పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMED ASHAKHAN ALTAF, S/o SHAIK MOHAMMED ASHAKHEEN, Muslim, Male, aged 41 years, resident of H.No: 16b-14-72, Rahamath Street, 4th street, Badetinagar, Tangellamudi, Eluru, Eluru District- 534005, A.P, have changed my name from ASHAKHAN ALTAF MOHAMMED (Oldname) to MOHAMMED ASHAKHAN ALTAF (New name) and the same is intimated to General Public

పాస్‌పోర్టు పోయినది

ది.30-12-2025వ తేదీన నాయొక్క పాస్‌పోర్టు నెం.S9271658 గల పాస్‌పోర్టు పెదకాపవరం నుండి ఆకివీడు సెంటరుకు మోటార్‌సైకిల్‌పై వెళ్ళుచుండగా దారిలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియచేయవలసినదిగా యావన్మందికి కోరడమైనది.

కఠారి అనిత, భర్త జోసెఫ్,
పెదకాపవరం-534 235,
ఆకివీడు మండలం, ప.గో.జిల్లా జిల్లా.
సెల్: 7288010515.